క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి



డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ

నందికొట్కూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీపీ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని తెలిపారు. ముఖ్యమంత్రి జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. గ్రామ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధం కండి

పాములపాడు: వ్యవసాయ విద్యుత్ కోసం ఉద్యమానికి ప్రజలు, రైతులు పోరాటానికి సిద్ధం కావాలని రైతు సంఘం సీనియర్ నాయకులు రామేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్ర వారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తోందన్నారు. దేశంలో కేరళ, తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానాలు చేశాయన్నారు. ప్రజలందరూ చైతన్యమై విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పండ్ల తోటల పెంపకంతో లాభాలు



మస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ అన్వరాబేగం

పాములపాడు: పండ్లతోటల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని ఏపీడీ అన్వరాబేగం అన్నారు. శుక్రవారం మండలంలోని వాడాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ప్రధానంగా ఆ గ్రామానికి చెందిన వ్యక్తులు కొందరు 4 విషయాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. పీడీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. గతంలో కాల్వ పని జరిగిన ప్రదేశంలో గాకుండా మరో చోట కూలీలతో ఫొటో తీశారని, కాల్వ పనులు చేసిన ఇరిగేషన్ వారు సిమెంట్ బెడ్లు వేయడం జరిగిందని, వర్క్ ఐడీ పేమెంట్ చేయలేదని ఈ విషయాలపై పరిశీలించి సమస్య పరిష్కరించినట్లు వివరించారు. అంతకుముందు మస్టర్ పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఏపీఎం విమలమ్మ, సిబ్బంది వెంట ఉన్నారు.

భ్రామరికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఆశీనులు చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

సారా విక్రేత అరెస్ట్

నందికొట్కూరు: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో నాటు సారా విక్రయిస్తున్న నీలిశికారి లక్ష్మిని పోలీసులు అరెస్టు చేసి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు.

మల్లన్న సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలంటెంపుల్/మహానంది: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను, మహానందీశ్వర స్వామివారిని కర్ణాటక న్యాయమూర్తి జస్టిస్ జి.బసవరాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం ఆలయం వద్దకు విచ్చేసిన వారికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. దర్శనం అనంతరం అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఏఈఓ హరిదాసు స్వామివారి శేషవస్త్రాలు, లడ్డుప్రసాదాలను అందజేసి సత్కరించారు. మహానందిలో రాహుకేతు పూజల్లో పాల్గొన్నారు



తుమ్మలూరు గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



రుద్రవరంలో నిర్మించిన ఓపెన్ డ్రైనేజీ

అభివృద్ధి పరుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల మంజూరు
- సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత
- రూ.12.15 కోట్లతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పాములపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ఎమ్మెల్యే నియోజకవర్గంలో గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఎమ్మెల్యేతో పాటు అన్ని శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించడం ద్వారా ఎన్నడూలేని కొత్త విధానానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపడుతున్నారు. గుర్తించిన సమస్యలపై ప్రతిపాదనలు పంపడంతో ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రధానంగా తాగు నీటి సమస్య, డ్రైనేజీ, సీసీ రోడ్ల పరిష్కారం అయ్యాయి. వీటిపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పురోగతిపై ఆరా తీస్తున్నారు.

నియోజకవర్గంలో రూ.9.55 కోట్లతో అభివృద్ధి పనులు

నందికొట్కూరు నియోజకవర్గంలో 79 సచివాలయాలకు గాను ఇప్పటి వరకు 72 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. 72 సచివాలయ పరిధిలోని ప్రతి గడపను ఎమ్మెల్యే సందర్శించి ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.9,55,26,000 మంజూరు చేసింది. ఈ నిధులతో పంచాయతీరాజ్ శాఖ 151 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ 90 పనులను మంజూరు చేయడం జరిగింది.

మండలాల వారీగా మంజూరైన నిధులు, జరిగిన పనులు

మండలం	పనులు	మంజూరైన నిధులు	పూర్తయినవి	ప్రోగ్రెస్‌లో ఉన్నవి
పంచాయతీరాజ్ పరిధిలో..				
పాములపాడు	43	రూ.1.99 కోట్లు	8	35
మిడుతూరు	30	రూ.1.24 కోట్లు	7	3
పగిడ్యాల	5	రూ.15.50 లక్షలు	-	-
కొత్తపల్లి	20	రూ.3.80 కోట్లు	-	-
జూపాడుబంగ్లా	23	రూ.1.15 కోట్లు	4	19
నందికొట్కూరు	30	రూ. 82 లక్షలు	10	20
ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో..				
మండలం	పనులు	మంజూరైన నిధులు	పూర్తయినవి	ప్రోగ్రెస్‌లో ఉన్నవి
పాములపాడు	14	రూ.61 లక్షలు	5	9
మిడుతూరు	14	రూ.55 లక్షలు	1	13
పగిడ్యాల	15	రూ.24.10 లక్షలు	3	12
కొత్తపల్లి	4	రూ.20 లక్షలు	-	-
జూపాడుబంగ్లా	14	రూ.57 లక్షలు	3	5
నందికొట్కూరు	29	రూ.75.50 లక్షలు	3	26

ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరగడం ఇదే ప్రథమం



ఎన్నికల తర్వాత ఇంతవరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించడం ఇదే ప్రథమం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రతి వీధి, ప్రతి ఇంటికీ ఎమ్మెల్యేతో సహా అన్ని శాఖల అధికారులు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవడం చాలా మంచి నిర్ణయం. ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. – అంబయ్య, లింగాల

అభివృద్ధి పనుల్లో జాప్యం లేదు



గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎక్కడా జాప్యం చేయడం లేదు. నిధులు మంజూరైన వెంటనే జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి సహకారంతో గ్రామంలో పనులు చేస్తున్నాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు పంపడం, నిధులు మంజూరు కావడంతో వెంటనే సీసీ రోడ్లు, ఓపెన్ డ్రైనేజీ నిర్మాణాలతో పాటు, పైప్‌లైన్లు ఏర్పాటు చేశాం.
– వరప్రసాద్, సర్పంచ్, తుమ్మలూరు

రూ.10 లక్షలతో పనులు చేశాం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధుల్లో రూ.10 లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేశాం. ప్రధాన రహదారి సంవత్సరాల తరబడి అధ్వానంగా ఉండేది. రోడ్డును బాగుచేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశాం. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సహకారం మరువలేనిది.
– రామస్వామి, సర్పంచ్, రుద్రవరం

ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టండి

పాములపాడు: ఇంటింటి సర్వేలో పొరపాట్లకు తావులేకుండా, పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ గోపికృష్ణ, తహసీల్దార్ రత్నరాధిక గ్రామ వలంటీర్లకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్షపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి లబ్ధి పొందని వారి వివరాలు సేకరించాలన్నారు. ఈ విషయంలో గ్రామ వలంటీర్లదే బాధ్యత అన్నారు. ఒక్కో గ్రామంలో ఒక రోజు మండల అధికారులందరూ కలిసి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్యాంపు నిర్వహించి ప్రజలకు ధ్రువపత్రాలను అందిస్తారన్నారు. సాంకేతిక సమస్యలేమైనా తలెత్తితే ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఉంటుందని వివరించారు. క్యాంపు నిర్వహించే రోజున లబ్ధిదారులు తప్పని సరిగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదే అన్నారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారుల అలసత్వంతో తిప్పలు



సచివాలయం వద్ద వేచిఉన్న విద్యార్థుల తల్లులు

కొత్తపల్లి: అధికారుల అలసత్వం కారణంగా మండలంలో చిన్నారుల తల్లులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని ఎర్రమఠం గ్రామ సచివాలయం పరిధిలో జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం నగదు తల్లుల బ్యాంకు ఖాతాలో జమ కావాలంటే బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయాల్సి ఉంది. ఇందుకు సచివాలయ సిబ్బంది గానీ, గ్రామ వాలంటీర్ గాని విద్యార్థుల తల్లుల ఇంటి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ పూర్తిచేయాలి. అయితే అధికారులు అలసత్వంతో విద్యార్థుల తల్లులే సచివాలయానికి వచ్చి బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని ప్రకటించారు. ఆ గ్రామాల ప్రజలు సచివాలయానికి వచ్చేందుకు ప్రయాణ సౌకర్యం లేదు. ఏదో తిప్పలు పడి శుక్రవారం ఎర్రమఠం సచివాలయానికి సుమారు 30 మంది గిరిజనుల మహిళలు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటలైనా సిబ్బంది రాకపోవడంతో అక్కడే వేచి ఉండాల్సి వచ్చింది. ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మిగులు సీట్ల భర్తీకి చర్యలు

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతిలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 26న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుజన తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నాగరవీంద్ర సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ స్కూలులో 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, జులై 2న ఉదయం 8 గంటలకు మోడల్ స్కూలులో ప్రవేశ పరీక్ష నిర్వహించి అడ్మిషన్లు చేపడతామని వివరించారు.

వెలుగోడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతిలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. 7వ తరగతిలో 1, 8వ తరగతిలో 7, 9వ తరగతిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తులు స్కూల్‌లో అందించాలని, 30వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఏడో తరగతిలో 3 సీట్లు, 8వ తరగతిలో 5 సీట్లు, 9వ తరగతిలో 15 సీట్లు ఖాళీలు ఉన్నాయని, వాటి భర్తీకి 28వ తేదీ లోపు దరఖాస్తు ప్రిన్సిపాల్ సలీంబాష సూచించారు. జులై 5న రాత పరీక్ష నిర్వహించి అడ్మిషన్లు చేపడతామన్నారు.

ఈఓ ఆకస్మిక తనిఖీలు

మహానంది: దేవస్థానం ప్రాంగణంలోని దుకాణాల్లో బీడీ, సిగరెట్లు, గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గుట్టుగా విక్రయిస్తున్న గుట్కా, సిగరెట్ ప్యాకెట్లు భారీగా స్వాధీనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిషేధించడంపై శనివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వలంటీర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం

మహానంది: బండిఆత్మకూరు మండలంలో ఇటీవల నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి గైర్హాజరైన వలంటీర్లకు నోటీసులు ఇస్తే ఇంత వరకూ కొందరు సమాధానం ఇవ్వలేదని ఎంపీడీఓ వాసుదేవగుప్త ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 42 మందికి నోటీసులు ఇవ్వగా ఇంకా కొందరు వలంటీర్లు స్పందించలేదని, వారి నుంచి వివరణ తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

కలెక్టర్‌కే పూర్తిస్థాయి అధికారాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం గ్రామ పరిపాలనపై సర్వహక్కులు జిల్లా కలెక్టర్‌వేనని పేర్కొంటూ నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 19న కలెక్టర్ సున్నిపెంట గ్రామంపై ఆర్‌ఓసీ నంబర్ 2703 ప్రకారం ప్రత్యేక ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇకమీదట జలవనరుల శాఖ అధికారులతో సహా ఎవ్వరూ సున్నిపెంటలోని గృహాలను అలాట్‌మెంట్ చేయడం, గృహాలు, స్థలాలను రెగ్యులరైజ్ చేయడం, భూమిని లీజుకు ఇవ్వడం వంటివి చేపట్టరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత మే 11న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 208.74 ఎకరాలలో ఉన్న గ్రామంపై పూర్తి హక్కులు పంచాయితీరాజ్ శాఖ గ్రామ పంచాయితీకి ఉన్నాయని, ప్రజల ఉపయోగార్థం గ్రామపంచాయతీ అధికారులు జిల్లా కలెక్టర్ అనుమతితో రెగ్యులరైజ్, అలాట్‌మెంట్, లీజు వ్యవహారాలను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారన్నారు. త్వరలో సున్నిపెంటలో పంచాయతీరాజ్, రెవెన్యూ, ల్యాండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌తో సమగ్ర సర్వే చేపట్టనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సున్నిపెంట గ్రామంపై జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా పంచాయతీ అధికారి కన్వీనర్ మెంబర్‌గా, జిల్లా రెవెన్యూ అధికారి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ మెంబర్లుగా కమిటీని వేశారు. సమగ్ర సర్వే అనంతరం ప్రభుత్వ గృహాలు, ప్రైవేటు గృహాలు, వ్యాపార దుకాణాలు, సముదాయాలు, ఇతర ప్రైవేటు సంస్థల భవనాలపై కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందని, మిగులు భూములను గ్రామ కంఠంగా నిర్ణయించనున్నట్లు ఆ ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్నారు.

మా పెత్తనం ఏమీ లేదు

సున్నిపెంట గ్రామంపై మా పెత్తనం చెల్లిపోయింది. ఇక నుంచి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంపై సర్వహక్కులు కలిగి ఉన్నారు. 208.47 ఎకరాలలో ఉన్న భూమి, ప్రభుత్వ, ప్రైవేట్, వాణిజ్య భవనాల కేటాయింపులు, అలాట్‌మెంట్లు, జిల్లా కలెక్టర్ ఆదేశాలతోనే జరుగుతాయి.
– శ్రీరామచంద్రమూర్తి, ఎస్ఈ, శ్రీశైలంప్రాజెక్టు

ఆలయ నిర్మాణానికి విరాళం

మహానంది: గాజులపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుంకులమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.లక్ష, గాజులపల్లె వైఎస్సార్‌సీపీ నేత కొండా మధుసూదన్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. నంద్యాల పట్టణంలోని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నివాసంలో శుక్రవారం రాత్రి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందించారు.



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, మధుసూదన్‌రెడ్డి

సంక్షేమ పాలనకే ప్రజా మద్దతు



దివ్యాంగురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం పీఠం ఎక్కిస్తాయని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండ్లెం-2 సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి అధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికార దాహంతో మాజీ సీఎం చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ నోటికొచ్చిన హామీలన్నీ ఇస్తూ ప్రజలను బురిడి కొట్టించాలని యత్నిస్తున్నారన్నారు. వారు ఎలాంటి హామీలిచ్చినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. పార్టీ గుర్తే లేని పవన్‌కళ్యాణ్ వారాహి రథమెక్కి మదమెక్కిన ఆంబోతులా బూతులు మాట్లాడుతూ, సినిమా డైలాగులు చెప్పడం వీధి రౌడీని తలపిస్తోందన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2024లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని, జనం జగన్న వైపే ఉన్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, ఇళ్లమీదుగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయించాలని, నూతన పింఛన్లు, పక్కాగృహాలు మంజూరు చేయించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సర్పంచ్ పుట్టల కృపమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, సురేంద్ర రెడ్డి, సగినేల వెంకటరమణ, హుసేనయ్య, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం చెల్లించాలి

కొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు జాతీయ రహదారి-167 కే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూ సేకరణ చట్టం-2013 ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.సంజీవరాయుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.స్వాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు, ఇన్‌పుట్ సబ్సిడీ, కనీస మద్దతు ధర తదితర సమస్యలను పరిష్కరించాలని కొత్తపల్లి మండలంలోని శివపురం, పెద్ద గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం తదితర గ్రామ పంచాయతీలలోని రైతు భరోసా కేంద్రాలలో వీఏఏలకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి 167కే నిర్మాణానికి కొత్తపల్లి మండలంలోని ఎర్రమఠం ముసలమడుగు, శివపురం, గోకవరం, దుద్యాల గ్రామపంచాయతీలలో రైతులు 291 ఎకరాలలో భూములు కోల్పోతున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు కనీసం రైతులతో సమావేశాలు కూడా జరపకుండా భూములు సేకరించడం సరైన పద్ధతి కాదన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేసి రైతుల అనుమతితోనే భూములను తీసుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ గ్రామాల్లో రైతులతో సమావేశాలు జరపాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం, ఆర్‌బీకే తనిఖీ

వెలుగోడు: పట్టణంలోని 3వ ఆర్బీకే కేంద్రాన్ని, ఎరువుల దుకాణాన్ని ఏఓ పవన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మట్టి నమూనా సేకరణ త్వరగా పూర్తిచేయాలని వ్యవసాయ అసిస్టెంట్‌కు సూచించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇప్పించాలని ఆదేశించారు. అనంతరం ఎస్ఐ జగన్‌మోహన్‌తో కలిసి ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. వీఆర్వో చక్రపాణి, వ్యవసాయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పల్లకిలో ఆదిదంపతుల విహారం

మహానంది: మహానందిలో వెలసిన శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు శుక్రవారం రాత్రి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేపట్టారు. ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోండి

ఆత్మకూరు: మండలం, పట్టణంలో గురుపౌర్ణమి, బక్రీద్ పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పండుగల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి

నందికొట్కూరు: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జూలై 1న అధికారులు బృందాలుగా ఏర్పడి సచివాలయంలో క్యాంపు నిర్వహించి అక్కడికక్కడే పథకాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ కిశోర్, మేనేజర్ మంజునాథ్‌గౌడు, వలంటీర్లు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: జగనన్న సురక్షతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు అన్నారు. కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని మండలాధికారులు, నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో వీడియో ద్వారా వీక్షించారు. ఏపీఓ అలివేలుమంగమ్మ, ఏఓ, సర్పంచ్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పక్కాగా నిర్వహించాలి

కొత్తపల్లి: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు జగనన్న సురక్షలో పాల్గొని ప్రజలకు సేవలందించాలని ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ పెద్దన్న సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు

పగిడ్యాల: జూలై 1 నుంచి ప్రారంభిస్తున్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి మండలంలో సురక్ష విజయవంతంపై చర్చించారు. తహసీల్దార్ భారతీ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

వెలుగోడు: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ షేక్ అమానుల్లా సూచించారు. శుక్రవారం రేగడగూడురులో కార్యక్రమం నిర్వహణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నాయకులు తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఓ రసూల్ పాల్గొన్నారు.

మహానంది: అర్హత ఉన్న ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు దూరం కాకూడదన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి సూచించారు. బండిఆత్మకూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ వాసుదేవగుప్త ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతం చేయడంపై పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరిత, ఈఓఆర్డీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: జగనన్న సురక్షను విజయవంతం చేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించి సూచనలు చేశారు. తహసీల్దార్ ఉమాదేవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ఖరారు

వెలుగోడు: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్‌ను ఎంపీడీఓ షేక్ అమానుల్లా విడుదల చేశారు. ఇందుకోసం రెండు టీమ్‌లుగా అధికారులను విభజించారు. 1వ టీమ్‌లో డీటీ శ్రీనివాసులు, ఏఎస్ఓ పాల్, ఈవోఆర్‌డీ వెంకట్‌రెడ్డి ఉంటారు. 1వ టీమ్ జూలై 1న అబ్దుల్లాపురం, 4న బోయరేవుల, 6న గుంతకందాల, 11న మోతుకూరు, 13న రేగడగూడురు-1, 15న రేగడగూడురు-2, 18న వెలుగోడు-1, 20న వెలుగోడు-2, 22న వెలుగోడు-3, 25న వెలుగోడు-4, 27న వెలుగోడు-5, 29న వేల్పనూరు-1, టీమ్-2లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌సయ్యద్ ఉమర్, ఆర్ఐ వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ షేక్ అమానుల్లా ఉంటారు. వీరు 29న వేల్పనూరు-2 సచివాలయాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలు సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమయ్యే ధ్రువపత్రాలు అందించనున్నారు.

మహానంది: సీఎం జగనన్న ఆశయాలను నెరవేర్చేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వర రెడ్డి తెలిపారు. గాజులపల్లె, గోపవరం గ్రామాల్లో శుక్రవారం అధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమంపై సూచనలు చేశారు. జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.